క్లుప్తంగా

రామాపురంలో పారిశుధ్య పనులు



వీధుల్లో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని రామాపురంలో డెంగీ కేసు నమోదు కావడంతో సర్పంచ్ కసిరెడ్డి కోటిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం ప్రతి వీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు, ఫాగింగ్ చేయించారు. డ్రెయినేజీలో నిల్వ ఉన్న మురుగు నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకున్నారు.

కౌన్సిల్ అనుమతిస్తే లైట్ల మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: మార్కాపురం–కంభం ప్రధాన రహదారిలో, గుండ్లకమ్మ నది వంతెనపై, చెరువు కట్ట రోడ్డులో వీధి దీపాలు మరమ్మతులు చేసేందుకు కౌన్సిల్‌కు ప్రతిపాదనలు పంపామని, అనుమతి రాగానే రిపేరు చేస్తామని మున్సిపల్ కమిషనర్ నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీధి దీపాల సమస్యపై బుధవారం 'చీకటితో స్వాగతం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. త్వరలోనే మరమ్మతులు చేస్తామని పేర్కొన్నారు.

34 మద్యం బాటిళ్లు పట్టివేత



సీజ్ చేసిన మద్యంతో ఎస్సై రవీంద్రారెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్లలో బెల్ట్‌షాపు నిర్వాహకుడిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన 34 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బెల్ట్‌షాపులు నిర్వహించినా, నాటుసారా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

క్షేత్ర దర్శిని పోస్టర్ ఆవిష్కరణ



కేత్రదర్శిని పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎం, సిబ్బంది

పొదిలి రూరల్: భక్తుల సౌకర్యార్థం పంచారామ క్షేత్ర దర్శిని పోస్టర్‌ను పొదిలి డిపో మేనేజర్ జె.సుందరరావు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం బస్సులకు పోస్టర్లు అంటించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఈ నెల 10, 17, 24వ తేదీల్లో పొదిలి డిపో నుంచి రాత్రి 10 గంటలకు బస్సు బయలుదేరి సోమవారం పంచారామ క్షేత్రాల దర్శనం అనంతరం మంగళవారం ఉదయం యథాస్థానానికి చేరుతుందన్నారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షరామం, సామర్లకోటలోని పంచారామ క్షేత్రాలను దర్శించుకునేందుకు ఆసక్తి ఉన్న భక్తులు 9959225700, 7382906480, 7382892255ను సంప్రదించాలని కోరారు.

ఫలించిన కార్మికుల పోరాటం




కాంట్రాక్టు కార్మికులతో సీఐటీయూ నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘం కార్యాలయం ఎదుట గత 22 రెండు రోజులుగా రిలే నిరహార దీక్షలు చేస్తున్న కార్మికుల పోరాటం ఫలించింది. గత 25 ఏళ్లుగా పనిచేస్తున్న తమను రాజకీయ ఒత్తిళ్లతో తొలగించారని కార్మికులు మున్సిపల్ ఆఫీస్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ దశల్లో ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు స్పందించి రెండు రోజుల్లో విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకెఎం రఫీ తెలిపారు. బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ.. కార్మికుల ఐక్య పోరాటంతోనే ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు యూనియన్ నాయకులు సుబ్బారాయుడు, హరి, సలాం ఖాన్, కనకయ్య, షబ్బీర్, యూసఫ్ పాల్గొన్నారు.

డబుల్ షాక్!

- ఎన్నికల ముందు తమ ప్రభుత్వం వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు
- ట్రూఅప్ చార్జీలు పేరుతో కరెంటు బిల్లులు వడ్డించేందుకు రంగం సిద్ధం
- ఈ నెల నుంచే ప్రజలపై విద్యుత్ చార్జీల భారం
- డిసెంబర్‌లో మరోమారు చార్జీలు పెంచేందుకు 'కూటమి' కసరత్తు
- అధికారంలోకి వచ్చాక లోటు బడ్జెట్ అంటూ సాకులు



మార్కాపురం/మార్కాపురం టౌన్: ''ఏం తమ్ముళ్లూ.. కరెంటు చార్జీలు భారంగా మారాయా లేదా? మీరే చెప్పండి. ఈ ప్రభుత్వం మనకవసరమా? కూటమి అధికారంలోకి రాగానే కరెంటు చార్జీల భారం తగ్గిస్తామని హామీ ఇస్తున్నా..'' ఇవీ గత ఎన్నికల ముందు ప్రతి ప్రచార సభలో చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు. కట్ చేస్తే.. డిస్కంలు నష్టాల్లో ఉన్నాయి. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉందంటూ ఎల్లో మీడియాలో ఊదరగొట్టి ప్రజలపై కరెంటు చార్జీలు మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. తాను అధికారంలో ఉండగా అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకుని ప్రైవేట్ పవర్‌ప్లాంట్లకు లబ్ధి చేకూర్చిన చంద్రబాబు.. చార్జీల భారం మొత్తాన్ని ప్రజలపై మోపేలా చేశారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇటీవల రాష్ట్ర ప్రజలపై ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.6070 కోట్ల భారాన్ని మోపేందుకు సర్వం సిద్ధం చేసిన కూటమి ప్రభుత్వం.. ఈ ఏడాది డిసెంబర్ నుంచే మరో రూ.17800 కోట్ల రూపాయల భారాన్ని మోపాలని యోచిస్తోంది. ఈ మేరకు ఏపీఈఆర్సీకి ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది.

భారం తడిసి మోపెడు

మార్కాపురం నియోజకవర్గంలో దాదాపు 1.13 లక్షల విద్యుత్ కనెక్షన్లు, గిద్దలూరు నియోజకవర్గంలో సుమారు 1.35 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ఎల్‌టీ 1 కేటగిరీ నుంచి ఎల్‌టీ5 కేటగిరీల వరకు విద్యుత్‌ను వినియోగించుకుంటున్న వారు ఉన్నారు. మార్కాపురం పట్టణంలో గత నెల డిమాండ్ 3.43 కోట్లు, మార్కాపురం మండలంలో రూ.80.62 లక్షలు, తర్లుపాడులో రూ.42.73 లక్షల విలువైన విద్యుత్ డిమాండ్ ఉంది. గిద్దలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇంచుమించు మార్కాపురం తరహాలోనే విద్యుత్ డిమాండ్ ఉంది. ఈ నెల నుంచి ట్రూఅప్ చార్జీల భారం మోపనున్న నేపథ్యంలో ప్రభుత్వానికి భారీగానే ఆదాయం సమకూరనుంది. కానీ పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ చార్జీలు అశనిపాతంలా మారనున్నాయి. డిసెంబర్‌లో మరోమారు చార్జీల పెంపు ఉంటుందని సంకేతాలు అందుతున్న నేపథ్యంలో ప్రతి నెలా విద్యుత్ బిల్లులకే రూ.1500 నుంచి 5 వేల వరకు చెల్లించాల్సి ఉంటుందని మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ట్రూ అప్ వడ్డింపుతో పేదలు కూడా రూ.500కు పైగా కరెంటు బిల్లు చెల్లించాల్సి ఉంటుందని అంచనా. విద్యుత్ బిల్లుల పెంపు నేపథ్యంలో కుటీర పరిశ్రమలు, చిన్న తరహా ఫ్యాక్టరీల యజమానుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఇంత మోసమా బాబూ?

అధికారంలోకి రావడానికి చంద్రబాబు, కూటమి నాయకులు అడ్డగోలుగా హామీలు గుప్పించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఖజానాను ఊడ్చేస్తున్నారు, దుబారా చేస్తున్నారంటూ విష ప్రచారం చేసిన చంద్రబాబు అండ్ కో.. తీరా ఎన్నికల వేళ సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర బడ్జెట్‌ను మించి ఖర్చు చేసే ఓ మేనిఫెస్టోను విడుదల చేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో పన్నులు, విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని వల్లె వేసిన చంద్రబాబు.. తీరా అధికారం చేపట్టాక ఒట్టు తీసి గట్టున పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు విద్యుత్‌పై ఒక్క రుపాయి కూడా పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే మొత్తం రూ.23 వేల కోట్ల భారం మోపేందుకు సిద్ధం కావడంపై ప్రజలు, ప్రజా సంఘాల నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ కనెక్షన్ల వివరాలు

మార్కాపురం నియోజకవర్గం

మార్కాపురం టౌన్	33,895
మార్కాపురం రూరల్	19,159
తర్లుపాడు	12,316
పొదిలి	28,485
కొనకనమిట్ల	20,013
మొత్తం	1,13,868

గిద్దలూరు నియోజకవర్గం

గిద్దలూరు	38,000
కంభం	26,217
బేస్తవారిపేట	21,400
కొమరోలు	15,909
అర్ధవీడు	16,533
రాచర్ల	16,989
మొత్తం	1,35,048

విద్యుత్ చార్జీల పెంపు అన్యాయం



సామాన్య ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం అన్యాయం. ఇతర ఆదాయ మార్గాలను ఎంచుకుని ఆర్థికాభివృద్ధి సాధించి వినియోగించుకోవాలి. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరకులు, నూనెలు, కూరగాయల ధరలతో ఆర్థికంగా కుంగిపోతున్నాం. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ, పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపకుండా చూడాలని కోరుతున్నాం.

– ప్రదీప్, మార్కాపురం

ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలపై ఆర్థిక భారం మోపడం అన్యాయం. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. పెరిగిన నిత్యావసర ధరలకు తోడు విద్యుత్ చార్జీలు కూడా పెంచి ప్రజలపై మరింత భారం వేయడం సరికాదు. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థికాభివృద్ధికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం చార్జీల భారం మోపి కుంగతీయడం సరికాదు. విద్యుత్ చార్జీలు పెంచకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం ఎంచుకోవాలి. లేదంటే ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుంది.

– పాపిరెడ్డి, రైతు సంఘ నాయకులు, తర్లుపాడు

ట్రూఅప్ చార్జీల పేరుతో దోపిడీ



ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై రూ.6700 కోట్ల వరకు అదనపు భారం వేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణం. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుండటం, ఆ తర్వాత గృహాల్లో కూడా స్మార్ట్ మీటర్లు బిగించాలని నిర్ణయించడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లులను పెంచే ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.

– మహమ్మద్ ఇబ్రహీం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, కంభం

విధులకు డుమ్మా కొడుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు



కంభంలో విలేజ్ క్లినిక్‌కు బుధవారం ఉదయం 11 గంటల వేళ తాళం వేసి ఉండటంతో బయట వేచి ఉన్న వృద్ధుడు

కంభం:


విలేజ్ క్లినిక్‌లలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీలు విధుల్లో సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు వైద్యసేవలు అందక ఇబ్బంది పడుతున్నారు. వైద్యాన్ని ప్రజల ముంగిటకు తీసుకురావాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి బీఎస్సీ నర్సింగ్ చేసిన వారికి మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లుగా నియమించింది. అయితే ఇటీవల కాలంలో కొందరు ఎంఎల్‌హెచ్‌పీలు హెల్త్ క్లినిక్‌లలో అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు తీవ్ర స్థాయిలో వస్తున్నాయి. కంభం మండలంలో 14 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉండగా, బేస్తవారిపేట పీహెచ్‌సీ క్లస్టర్ పరిధిలోకి 9, తురిమెళ్ల పీహెచ్‌సీ పరిధిలోకి 5 వస్తాయి. వీటిలో ఎంఎల్‌హెచ్‌పీలు రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాలి. మధ్యాహ్నం నుంచి వారి పరిధిలోని గృహాలను సందర్శించి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీసి వైద్యసేవలు అందించాలి.

అలాగే రోజూ మొబైల్‌లో ఫేషియల్ యాప్ ద్వారా వారి పరిధిలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడుసార్లు హాజరు వేయాల్సి ఉంటుంది. కొందరు సిబ్బంది అక్కడికి రాకుండా వారు ఉన్న చోటే ఫేక్ కోఆర్డినేట్స్‌తో ఫేషియల్ అటెండెన్స్ వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చర్యలు తీసుకుని, సమయపాలన పాటించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వీధి కుక్కలతో భయం.. భయం!



మార్కాపురంలో వీధికుక్కలు



కుక్క కాటుకు గురైన గురవయ్య

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో వీధి శునకాలు రాజ్యమేలుతున్నాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ కనబడిన వారిని కరుస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీటికి కోతులు కూడా తోడయ్యాయి. మున్సిపల్ సమావేశాల్లో పలువురు కౌన్సిలర్లు కుక్కలు, కోతుల బెడదను నివారించాలని కోరారు. కుక్కల బెడద మాత్రం తీరలేదు. చిన్నపిల్లలు, ముసలివాళ్లు రోడ్డుపై వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి మార్కాపురం పట్టణంలో నెలకొంది. ఎక్కడ చూసినా వీధికుక్కలు స్వైరవిహారం చేస్తూ కనబడిన వారిని కరిచేస్తున్నాయి. పట్టణంలోని అక్కమ్మబావి, ఆకులవారి వీధి, ఎస్సీ బీసీ కాలనీ, విజయ టాకీస్ రోడ్డు, జవహర్‌నగర్ కాలనీ, పూలసుబ్బయ్య కాలనీ, ఇండో ఫ్యాక్టరీ లైన్, కోర్టు సెంటరు, శ్రీనివాస థియేటర్ ఏరియా, నెహ్రూ బజారు ఇలా ఒకటేమిటి పట్టణంలోని ప్రతి వీధిలో కుక్కలు ఎక్కువయ్యాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అక్కమ్మబావి వీధి సమీపంలోని ఆకులవారి వీధిలో మంగళవారం గురవయ్య అనే వ్యక్తిని కుక్క కరిచింది. ఇదే కుక్క ఆ ప్రాంతంలో వెళ్లే సుమారు ఐదుగురిపై కూడా దాడిచేసింది. ఇలా రోజూ కుక్క కాటుకు పలువురు ఇబ్బంది పడుతున్నారు. వీధి కుక్కలు ఎక్కువయ్యాయంటూ మున్సిపల్ సిబ్బందికి తెలిపినా ఫలితం లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోనూ వీధికుక్కల బెడద ఎక్కువైంది. చింతగుంట్ల, తిప్పాయపాలెం, నికరంపల్లి, గజ్జలకొండ, బోడపాడు, దరిమడుగు, రాయవరం తదితర గ్రామాల్లో చిన్నపిల్లలు కుక్క కాటుకు గురయ్యారు. బయట ప్రాంతాల నుంచి ఉదయం పూట బస్సు దిగి వచ్చేవారిని కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. మార్కాపురం జీజీహెచ్‌కు కుక్క కాటు బాధితులు తరచూ వచ్చి వ్యాక్సిన్ వేయించుకుని వెళ్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఏలూరులో మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం ఇస్తున్న 104 సిబ్బంది

పొదిలి రూరల్: 104 వాహనాల్లో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం పొదిలి మండలంలోని ఏలూరు సచివాలయంలో విధుల్లో ఉన్న కాకర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఎస్.సాయి రుచితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ.. తమకు గత మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలను పోషించడం కష్టంగా ఉందన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా రూ.50 వేలు ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ 7 ద్వారా వేతనం చెల్లించాలని కోరారు. అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని, డ్రైవర్లకు లాక్ శ్లాబ్ అమలు చేయాలని, డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని, యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించి విధంగా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో డీఈఓ చిరంజీవి, డ్రైవర్ శివ తదితరులు పాల్గొన్నారు.

పొగనారుమడుల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్



సలకనూతలలో రైతులకు అవగహన కల్పిస్తున్న గిరిరాజ్‌కుమార్



తువ్వపాడులో మాట్లాడుతున్న ఏఓ శైలజ

పొదిలి రూరల్: రైతులు పొగనారుమడుల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని పొదిలి వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.గిరిరాజ్‌కుమార్ సూచించారు. బుధవారం సలకనూతల గ్రామంలో పొగాకు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతానికి అనువైన, ఆరోగ్యవంతమైన నారును ఎంపిక చేసుకోవాలని చెప్పారు. నారుమడుల్లో పొగాకు లద్దె పురుగు కనిపించినప్పుడు ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా నవాల్యూరాం 5 గ్రాములకు 10 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. శనగపచ్చ పురుగు, మొవ్వతొలుచు పురుగు, కాండం తొలుచు పురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ 3 మిల్లీలీటర్లకు 10 లీటర్ల నీరు కలిపి పిచికారీ చేయాలన్నారు. పైమందులు పరిమితికి మించి విచక్షణారహితంగా వాడవద్దని స్పష్టం చేశారు. పురుగు మందులను మధ్యాహ్న సమయంలో, వర్షం పడే వేళలో పిచికారీ చేయవద్దని చెప్పారు. స్ప్రేయర్ నాజిల్ మొక్కకు తగినంత ఎత్తులో ఉంచి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ జి.వెంకటరావు, జీపీఐ ఉన్నం శ్రీనివాసరావు, ఫీల్డ్ ఆఫీసర్ సమీరుద్దీన్, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: పొగాకు పంటకు బదులుగా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రైతు శిక్షణా కేంద్రం ఒంగోలు వ్యవసాయాధికారి శైలజ సూచించారు. బుధవారం మండలంలోని తువ్వపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏఓ ప్రసన్న రంగలక్ష్మితో కలిసి రైతులతో సమావేశం నిర్వహించారు. తక్కువ పెట్టుబడి కలిగిన పంటలు సాగు చేస్తే రైతుకు కొంతమేర లాభం ఉంటుందని చెప్పారు. పొగాకు బదులుగా కంది, సజ్జ, అలసంద, మినుము, పప్పుశనగ సాగు చేసుకుంటే మంచిదన్నారు. సమావేశంలో పశువైద్యాధికారి అమూల్య, ఏఈఓ విక్రమ్, వీఏఏలు సాయిలక్ష్మి, శిరీషా, రైతులు పాల్గొన్నారు.

కొమరోలు: మండలంలోని అల్లినగరం, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో రైతులకు పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై ఏఓ కె.రాజశ్రీ అవగాహన కల్పించారు. గత రెండు, మూడేళ్లుగా పొగాకు పంట అధికంగా సాగు చేస్తున్నారని చెప్పారు. ధరలు అన్ని సీజన్లలో ఒకేలా ఉండవని, రానున్న కాలంలో రైతులు ఇబ్బంది పడే ప్రమాదం ఉందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులు అగ్రిమెంట్ చేసుకోవాలి



రాగి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ బాలాజీనాయక్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయభాస్కర్‌రెడ్డి

బేస్తవారిపేట: విత్తన ఉత్పత్తి కోసం మొక్కజొన్న పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఆయా కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ డి.బాలాజీ నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని కోనపల్లె, శింగసానిపల్లెలో పొలం పిసుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అగ్రిమెంట్ లేకుండా విత్తన ఉత్పత్తి సాగు చేయకూడదన్నారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు వేగవతి రకం రాగులు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఏఓ జక్కం మెర్సీ, ఎంపీఈఓ బేబీ, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి

గిద్దలూరు రూరల్: రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలను పండించాలని ఏఓ విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ముండ్లపాడులో రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ, ఎంపీఈఓ శ్రీనివాసరెడ్డి, వీఏఏలు, రైతులు తదితరులుపాల్గొన్నారు.

మంచినీటి ట్యాంక్‌లకు లీకేజ్



ట్యాంక్ నీరు లీకవడంతో బురదమయంగా మారిన రహదారి



పాచిపట్టి అపరిశుభ్రంగా ఉన్న మంచినీటి ట్యాంక్

కొమరోలు: మంచినీటి ట్యాంక్‌కు లీకేజ్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పొట్టిపల్లె గ్రామంలో పలు మంచినీటి ట్యాంక్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయి. ట్యాంక్‌లు పాచిపట్టి ఉండడంతోపాటు లీకేజ్ కారణంగా నీరంతా రహదారిపైకి ప్రవహిస్తుండటంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. నెలల తరబడి ట్యాంక్ లీకేజ్ అవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు కారణంగా దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాలల శ్మశానం ఆక్రమణకు గురికాకుండా చూడండి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని నాగులవరం రోడ్డులో ఉన్న మాలల శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా చూడాలని బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో రవీంద్రారెడ్డికి పలువురు వినతిపత్రం అందజేశారు. ఎవరైనా స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే తాము చూస్తూ ఉరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నూతలపాటి రాజు, గుమ్మడి మురళి, శ్రీనివాసులు, పి.చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



ఏవోకి వినతిపత్రం ఇస్తున్న రాజు, ఇతరులు